

# దారులు ధ్వంసం!

- అడుగడుగునా గోతులు.. ప్రయాణికులకు నరకం
- ప్రధాన రహదారులపైనా 4వేలకు పైగా గుంతలు!
- అంతర్గత రహదారులు మరీ అధ్వాన్నం
- మరమ్మతుల పేరుతో రూ.కోట్లలో వ్యయం
- అయినా మారని దుస్థితి



హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త: నగరం బురదమయంగా మారి విశ్వనగరంగా తీర్చిదిద్దే హైదరాబాద్‌లోనే ఉన్నామా? అన్న అనుమానం కలగిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. ప్రధాన రహదారుల నుంచి కాలనీలోని రోడ్ల వరకు గుంతలమయం అయ్యాయి. నాసికరం రోడ్లు వేయడం వల్లే డ్యామేజ్ అయ్యాయని నగరవాసులు ఆరోపించారు. రోడ్లపై ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఎక్కడ ఉంతలు ఉన్నాయో తెలియని పరిస్థితి. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు భారీగా దెబ్బతిన్నాయి.గ్రేటర్‌లో 9,103 కి.మీల రహదారులున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చాలా రోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టుమని పది మీటర్లు కూడా కుదుపు లేని ప్రయాణం నగర రోడ్లపై సాగే పరిస్థితి లేదు. ఫ్లైఓవర్ల కిందనున్న రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొండాపూర్ ఫ్లైఓవర్, కైత్లాపూర్ ఆర్ఓబి, హైటెక్ సిటీ ఆర్‌యూబీ, శిల్పారాం, బయోడైవర్సిటీ పార్కు రోడ్డు, గచ్చిబౌలి, ఎల్బీనగర్, బైరామల్‌గూడ రోడ్లు ధ్వంసమ య్యాయి. రూ.1850 కోట్ల అంచనా వ్యయంతో నగరంలోని 811 కి.మీ రోడ్లను మూడేళ్ల కింద ప్రైవేటు నిర్వహణకు ఇచ్చారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు గాను రూ.1,100 కోట్లు చెల్లించింది. వరుస వానలతో ఆయా రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై నాలుగు వేలకుపైగా గుంతలు పడ్డట్లు ఇంజినీర్లు అంచనా వేశారు. రోడ్ల నిర్మాణం మాత్రమే కాదు. గుంతల పూడ్చివేతకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఏటా గుంతల మరమ్మతుకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పైగా వెచ్చిస్తున్నారు. నగర శివారు ప్రాంతాలు బోడుప్పల్, ఫీర్జాదిగూడ, నిజాంపేట, దుండిగల్, మణికొండ తదితర మున్సిపాలిటీలలో పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుండి హేమనగర్ మీదుగా నాచారం వెళ్లే రహదారి మరీ ధారుణంగా తయారైంది. వందల కోట్లతో వేసిన రహదారులు కొన్ని ప్రాంతాల్లో మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. కొన్ని ప్రధాన ప్రాంతాల్లో రహదారులు అస్తవ్యస్తంగా మారటంతో వాహనాలు గుంతల్లో కూరుకుపోతున్నాయి. ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్పల్, బోడుప్పల్, మేడిపల్లి మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక ఉప్పల్ నల్లచెరువు రోడ్డు పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ఈ జాతీయ రహదారిలో ఎలివేటెడ్ బ్రిడ్జి పనులు దాదాపు నిలిచిపోగా.. ఈ మార్గంలోని రోడ్లనైతే పట్టించుకునేవారు లేకుండాపోయారని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# హైదరాబాద్ వార్త

# కళ్ల కలకలు

**సరోజినికి బారులు తీరుతున్న బాధితులు**
**నాలుగు రోజుల్లో 600 మందికి పైగా సరోజినికి**
**ఒక్కరికి సోకితే చాలు కుటుంబంలో అందరికి**

మెహిదీపట్నం, జులై 29, ప్రభాతవార్త : వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రతి ఒక్కరిలో కళ్ల కలక విజృంభిస్తుంది. కుటుంబంలో ఒక్కరికి సోకితే చాలు అందిరికి ఈ కళ్ల కలక అంటుకుండడంతో బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. దీంతో మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రికి బాధితులు క్యూ కడుతున్నారు. నగరం నలుమూలల నుంచి ఆసుపత్రికి వస్తున్న బాధితులు పెరుగుతుండడంతో ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి నివారణ చర్యలు చేపట్టారు. బాధితులకు ఈ వ్యాదిపై అవగాహన కల్పిస్తున్నారు. గత వారం రోజులుగా ఎడతెరుపు లేకుండా భారీ వర్షాలు కురవడంతో పాటు వాతావరణంలో మార్పులు రావడంతోనే ప్రతి ఒక్కరికి వ్యాది సోకుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించడంతో పాటు కుటుంబ సభ్యులతో దూరం పాటించాలని సూచిస్తున్నారు. సరోజినిదేవి కంటి ఆసుపత్రికి గత నాలుగు రోజులుగా 600 మందికి పైగా బాధితులు రాగా అందులో ఒకే కుటుంబానికి చెందిన వారు 4,5 సభ్యులు ఉంటున్నారని, ప్రతి రోజు 100 పైగా బాధితులు వస్తుండడంతో వారికి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులను అందజేస్తున్నామని డాక్టర్లు తెలిపారు.





మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రి, (ఇనిసెట్‌లో) ఎమర్జెన్సీ వద్ద బాధితులు



**ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాము : డాక్టర్ వి. రాజలింగం**

కళ్ల కలకతో వస్తున్న వారికోసం ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాటు చేశాం. ప్రతి రోజు 100 పైగా బాధితులు వస్తున్నారు. గత నాలుగు రోజులుగా 600 మందికి పైగా వచ్చారు. నగరం నలుమూలల నుంచి వస్తుండడంతో వారికి తగ్గట్టుగా పరీక్షలు నిర్వహించి మందులను ఇస్తున్నాము. ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు.

**కళ్ల కలక లక్షణాలు..** కళ్ల ఎర్రగా మారడం, కంటి నుంచి ఊసు రావడం, కళ్ల మంట, కళ్ల నొప్పి, తలనొప్పి, జలుబు, దగ్గు రావడం.

**జాగ్రత్తలు..** లక్షణాలు కనిపించిగానే కంటి వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సలహా మేరకు డ్రాప్స్ వాడాలి. రక్షణ కోసం కంటి అద్దా లను వాడాలి. ఒకరినుంచి మరొకరికి ఈ వ్యాది సోకే ప్రమాదం ఉండడంతో కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, మాట్లాడే సమయంలో దూరం పాటించాలి. ఒకరి టవల్స్ మరొకరు వాడవద్దు. చేతులను తరుచు కడుక్కోవాలి. గోరువెచ్చని నీటితో కంటిని శుభ్రం చేసుకోవాలి. కంటిని పదేపదే చేతితో నలుపకూడదు.

**కళ్లు ఎర్రగా మారడంతో ఆసుపత్రి వచ్చా : పట్టాభి రామయ్య, కాటేదాన్**

గత రెండు రోజులుగా కళ్లు ఎర్రగా మారి ఇబ్బంది పెడుతున్నాయి. కంటి నుంచి నీరు కారడంతో పాటు ఊసు వస్తుంది. దీంతో మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రికి వచ్చాను. డాక్టర్లు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఇప్పుడు కొంతమేర తగ్గింది.

## మొహార్రం వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్



షర్బత్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జూలై 29 ప్రభాతవార్త : అన్ని మతాలు, కులాల ప్రజలు సహజీవనానికి తెలంగాణ ప్రాంతం ప్రతీకగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. వారాసిగూడ, అంబర్‌నగర్ చిల్లా ప్రాంతాల్లో మొహర్రంను పురస్కరించుకొని షర్బత్ పంపిణీ శిబిరాల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పాల్గొని షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సంప్రదాయాలను తాము సంపూర్ణంగా గౌరవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నిర్వాహకులతో పాటు మైనారిటీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## మీడియా ఫీల్డ్ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

**డీడీ యాదగిరిలో వివిధ పోస్టులకు నోటిఫికేషన్**

హైదరాబాద్,జులై 29 ప్రభాతవార్త : దూరదర్శన్ యాదగిరి హైదరాబాద్ కేంద్రంలోని ప్రాంతీయ వార్త విభాగంలో వివిధ తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద యాంకర్ కమ్ కరస్పాండెంట్ గ్రేడ్ 2, యాంకర్ కమ్ కరస్పాండెంట్ గ్రేడ్ 3, బులెటిన్ ఎడిటర్ కాఫీ ఎడిటర్, బ్రాడ్ కాస్ట్ ఎగ్జిక్యూటివ్, వీడియో పోస్ట్-ప్రొడక్షన్ అసిస్టెంట్, అసైన్‌మెంట్ కోఆర్డినేటర్, కంటెంట్ ఎగ్జిక్యూటివ్, ప్యాకేజింగ్ అసిస్టెంట్, వీడియోగ్రాఫర్, సీనియర్ కరస్పాండెంట్ తదితర 11 కేటరీలకు తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిడి యాదగిరి జాయింట్ డైరెక్టర్, ఆర్ఎన్‌యూ హెడ్ రాహుల్ గౌలికర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్హతలు, ఎంపిక విధానం వంటి ఇతర పూర్తి వివరాలకు ప్రసారభారతి వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చని తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన



పిఆర్ సామాజిక భవనంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ సిఐ బాలరాజు

యూసుఫ్‌గూడ, జూలై 29, ప్రభాతవార్త : ప్రజలు సైబర్ నేరగాళ్ళ మధ్య మోసపోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ జె.బాలరాజు అన్నారు. శనివారం మోతీనగర్‌లోని పిఆర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో సామాజిక భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో దాదాపు 11 కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు వారి కమిటి సభ్యులతో కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం సైబర్ నేరాలపై జరిగిన కార్యక్రమంలో వృద్ధులు, యువకులు, మహిళలు, అప్రమత్తంగా ఉండాలని అపరిచితుల నుండి ఫోన్‌కాల్స్ వచ్చినపుడు వాటిని స్పందించకుండా ఉండాలని అన్నారు. అదేవిధంగా కాలనీల బస్తీలలో వాళ్ళు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్ళారు. తమ కాలనీలలో అపరిచితులు కనబడిన ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో పిఆర్ నగర్ కాలనీ సెక్రటరీ వంశీకృష్ణ, వివి సత్యనాయణ,లలిత్ మోహన్, జహంగీర్, సిహెచ్ సత్యనారాయణ, నాగుల సత్యం, ఆవుల సంజీవ, పినెపె చిన్నబ్బులు, వినోద్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వైద్య బృందం

## కోఠి ఇఎన్‌టి ఆసుపత్రిలో అరుదైన చికిత్స

అఫ్జల్‌గంజ్,జూలై 29ప్రభాతవార్త: కోఠి ప్రభుత్వ చెవి,ముకుక్క గొంతు ఆసుపత్రిలో ఓ బాలికకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి మరోసారి తమ సాటి లేరని నిరూపించుకున్నారు. నల్గొండ జిల్లా నిడ్మనూరు మండలం, ముప్పారం గ్రామానికి చెందిన హిమలత(10)కు గత కొద్ది రోజుల నుంచి తీవ్రమైన శ్వాస ఇబ్బందితో బాధపడుతూ కోఠి ఇఎన్‌టి ఆసుపత్రికి వచ్చింది. అక్కడి వైద్యులు ఆ బాలికకు ఆసుపత్రిలో చేర్చుకొని వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ బాలికకు శ్వాస నాళాంలో అంటే" కేరినా" అనే ప్రాంతానికి కొద్ది దూరంలో ఎగువ ప్రాంతంలో ఒక పులిపురి లాంటి ఉందని వైద్యులు గ్రహించారు. దాన్ని వైద్య పరిభాషలో"పాపిల్లోమా"ని గుర్తించారు. ఎక్కడైతే రెండు ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందించడానికి గాలి గొట్టం ద్వారా ట్రెకియా రెండుగా విడిపోతుంది.గమనించిన ఇఎన్‌టి వైద్య బృందం హేమలతకు అడ్డుగా వస్తున్న కెరీనా ప్రాంతానికి అడ్డుగా వస్తుండంతో ఇది ప్రాణానికి చాలా ప్రమాదకరమని వెంటనే శస్త్ర చికిత్స చేసి పాపిల్లో మాను తీసి వేశారు.ఈ అరుదైన శస్త్ర చికిత్స డాక్టర్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో ఇఎన్‌టి వైద్య బృందం రవిశంకర్,సత్యకిరణ్,అశీష్,మీనా,ఉమా, నిఖిల,నర్సులు రత్న,స్వప్న,బాలు,గోపాల్,శ్రీశైలం పాల్గొన్నారు. ఈ వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ అభినందించారు.ప్రస్తుతం హేమతల ఆరోగ్యంగా ఉందన్నారు.

## బూత్ స్థాయి నుంచి బిజెపి పార్టీనీ పటిష్టం చేయాలి

**జిల్లా అధ్యక్షులు డా. గౌతమ్ రావు**



మాట్లాడుతున్న బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. గౌతమ్ రావు తదితరులు

హైదరాబాద్, జులై 29 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలని సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. గౌతమ్ రావు పేర్కొన్నారు. శనివారం బిజెపి నగర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారులు, అసెంబ్లీ సమావేశానికి డా. గౌతమ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ బూత్ స్థాయిలో రీవెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీబలోపేతం అయినప్పుడే రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని చెప్పారు. వర్షాల కారణంగా నగరంలోని అనేక మంది అవస్థలు పడ్డారని గౌతమ్ రావు గుర్తు చేశారు. డివిజన్లలో సంభవించిన నష్టాన్ని గుర్తించి జిల్లా పార్టీకి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, సందీప్ సాయి పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఘనంగా మొహార్రం



నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్‌ను ఏనుగు ఆశీర్వదిస్తున్న దృశ్యం, శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్



చార్మినార్, జూలై 29 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు శనివారం 10వ మొహ ర్రం సామూహిక ఊరేగింపును నిర్వహించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.శనివారం హైదరాబాద్ పాతనగరంలో జరిగిన మొహర్రం ఊరేగింపును వేలాది మంది ప్రజలు తిలకించడానికి వచ్చారు.చార్మినార్,గుల్జారాహౌస్,కాలీకమాన్, మీరాలంమండి,దారుషిఫా రహదారులలో రహదారులకు రెండు వైపుల ప్రజలు నిలబడి ఊరేగింపును తిలకించారు. శనివారం మధ్యాహ్నం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన అంబారిపై ఆలంను ప్రతిష్టించిన అనంతరం ఊరేగింపు ప్రారంభం అయ్యింది.డబీర్‌పురలోని బీబీకా ఆలం నుంచి ప్రారంభమైన ఊరేగింపు డబీర్‌పుర,ఎత్తెబార్ చౌక్,సర్దార్ మహల్,చార్మినార్,గుల్జారాహౌస్, కాలీకమాన్,పంజేషా,మీరాలంమండి,దారుషిఫా ప్రాంతాల మీదుగా అజాఖానా జహరా ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది. నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పోలీస్ ఉన్నతాధికారులు చార్మినార్ వద్ద ఆలంకు దట్టీలు సమర్పించారు. మొహ ర్రం ఊరేగింపు సందర్భంగా పాతనగరంలో వెయ్యి మంది పోలీసులను మొహరింప చేశారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లింలు పాత నగరంలో సామూహిక ఊరేగింపును నిర్వహించారు. ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలు శరీరంపై బాదుకుంటూ రక్తాన్ని చిందించారు. అదనపు పోలీస్ కమిషనర్ విక్రం సింగ్ మన్న్,ట్రాఫిక్ అడిషనల్ డిసిపి జి.సుధీర్ బాబు, అడిషనల్ సిపి ఎస్‌బి విశ్వ ప్రసాద్, దక్షిణ మండలం డిసిపి సాయి చైతన్య, మీర్‌చౌక్ ఏసిపి దామోధర్‌రెడ్డి,చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్‌లు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో పలు చోట్ల ప్రజలు వేధికలు ఏర్పాటు చేసి స్వాగతం పలికి దట్టీలు సమర్పించారు.



మోహార్రం సందర్భంగా చార్మినార్ వద్ద ఊరేగింపు దృశ్యం



నారాయణగూడలోని వెంకటేశ్వర కాలనీలో టిటిడి ఆధ్వర్యంలో జరిగిన వెంకటేశ్వర కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

## లేడీస్ కోసం ఆర్టీసి స్పెషల్ బస్సులు



హైదరాబాద్, జూలై 29, ప్రభాత వార్త: అమ్మాయిలు బస్సు జర్నీ చేయాలంటే పెద్ద ప్రాబ్లం. ఎందుకంటే కొందరు ఆకతాయిలు అమ్మాయిలను ఆటపట్టిస్తూ.. వెకిలి చేష్టలు చేస్తూ వారితో మిస్‌బిహేవ్ చేస్తుంటారు. అంతేకాకుండా బస్సులో సీటు దొరక్క స్టాండింగ్‌లో వుంటే ఇక చెప్పనక్కర్లేదు..వెనుక నుంచి అమ్మాయిలను పట్టుకోవడం, చేతులు తాకడం వంటివి చేస్తుంటారు. ఇక సీటులో కూర్చున్నకూడా మహిళలకు సతాయిస్తూ టీజింగ్ చేస్తుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ఆర్టీసి శుభవార్త చెప్పింది. మహిళలపై జరుగుతున్న అరాచకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. మహిళల భద్రత కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. ముందుగా ఐటీ కారిడార్‌లో మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం టిఎస్ఆర్టీసి ప్రత్యేక మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సును ఏర్పాటు చేసింది. ఈ మహిళా ప్రత్యేక బస్సు జెఎన్‌టియూ నుండి వేవ్ రాక్ మార్గంలో ఉదయం, సాయంత్రం నడుస్తుంది. ఈనెల 31 నుంచి ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మార్గం లో మహిళలు పడుతున్న ప్రయాణ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ఈ ప్రత్యేక బస్సును అందుబాటులోకి తెస్తున్నట్లు ఆర్టీసి ఎండి విసి సజ్జనార్ తెలిపారు.

## నిజాం హాస్టల్ విద్యార్థులు భోజన కోసం రోడ్డుపై బైఠాయింపు

**విహెచ్ మంత్రితో చర్చిండంతో ధర్నా విరమించిన విద్యార్థులు**



రోడ్డు మీద బైఠాయించిన విద్యార్థులతో విద్యార్థులతో మాట్లాడుతున్న హనుమంతరావు, రోహిన్‌రెడ్డి

సైఫాబాద్, జులై 29 ప్రభాతవార్త: గత 18 రోజుల నుంచి నిజాం హాస్టల్‌లో డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులకు భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తూ శనివారం విద్యార్థులు హాస్టల్ ఎదురుగా ఉన్న రోడ్డుపైన బైఠాయించి ధర్నా చేపట్టారు. తక్షణమే విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థులను సముదాయించారు. వెంటనే విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో హనుమంతరావు సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి ఆగస్టు 1వ తేదీ నుంచి విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 30, 31 తేదీలలో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ భోజన సౌకర్యం కల్పిస్తుందని హనుమంతరావు చెప్పారు. 1వ తేదీ నుంచి కళాశాల యాజమాన్యం విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించి హాస్టల్‌లోకి వెళ్ళిపోయారు.

## ఒయు విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు చేసేందుకు వీహబ్ బృందంతో అధికారుల చర్చలు



వీహబ్ బృందంతో వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, జులై 29 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు అవసరమైన వసతులు సమకూర్చేందుకు ఓ.యూ అధికారులు వీహబ్ బృందంతో చర్చలు జరిపారు. ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ నేతృత్వంలోని అధ్యాపక బృందం వీహబ్ సీఈఓ దీప్తీరావు బృందంతో సుదీర్ఘంగా చర్చించారు. వీహబ్ ఎదుగుదల, వ్యాప్తి, ఆవిష్కరణలు, అంకురాల ఏర్పాటుకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఓ.యూలోని సీఎఫ్ఆర్డీ లో మరిన్ని అంకురాల ఏర్పాటు కోసం ఉన్న అవకాశాలపై సమావేశంలో చర్చించారు. మహిళా సాధికారిత దిశగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు చేసిన కృషిని వీహబ్ సీఈఓ దీప్తీరావు ఓ.యూ బృందానికి వెల్లడించింది. వీహబ్ చేపడుతున్న కార్యక్రమాల పట్ల వైస్ చాన్స్‌లర్ హర్షం వ్యక్తం చేశారు. వీహబ్‌తో జరిగిన చర్చలో ఓ.యూ నుంచి వైస్ చాన్స్‌లర్ రవీం దర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ప్రొ.నవీన్‌కుమార్, ప్రొ.డి.శ్రీరాములు, ప్రొ.ప్యాట్రిక్‌లు పాల్గొన్నారు.

## తెలంగాణలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం
### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చర్చి ఫాదర్, ప్రతినిధులు**

సికింద్రాబాద్, జూలై 29 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన క్రిస్టియన్ మైనారటి సెయింట్ మేరీస్ చర్చి ఫాదర్ మారినేని ఆరోగ్యం, క్యాథలిక్ సిమెట్రీ న్యూ బోయిగూడ పద్మారావునగర్ కమిటీ సభ్యులు జయరాజ్, ఆంతోని హార్సిలీ టార్పర్ మర్యాదపూర్వకంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌ను కలిశారు. అనంతరం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు సబంధించిన క్రిస్టియన్ మైనారిటీ స్మశానవాటికలను అభివృద్ధి చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ క్రిస్టియన్ మైనారిటీ స్మశానవాటికల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు త్వరలోనే ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అద్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.

## మొహర్రం మత సామరస్యానికి ప్రతీక: శ్రీగణేష్



**సిక్ విలేజ్ లో ప్రార్థనలు చేస్తున్న కంటోన్మెంట్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు శ్రీగణేష్**

బేగంపేట, జులై 29 ప్రభాతవార్త : త్యాగానికి చిహ్నంగా అన్యాయం, అసత్యానికి వ్యతిరేకంగా మొహర్రం పండుగను ముస్లిం సోదరులు జరుపుకుంటారని, కంటోన్మెంట్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు శ్రీగణేష్ తెలిపారు. మొహర్రం సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని సిఖ్ విలేజ్, తాడ్‌బండ్, కాకాగూడా లోని పీర్ల ఆషూర్ఖానాను ఆయన సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ముస్లీములు కాకుండా అన్ని వర్గాల ప్రజలు నిర్వహిస్తారని, ఇది మత సామరస్యనికి ప్రతీక అని అన్నారు. తెలంగాణలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను అందరూ కలసి మెలసి ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజాదావూద్, సలీం, అన్వర్, సుభాన్ తాజ్, నసీర్, గౌస్ అహ్మద్, ఇనౌస్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో కులమతాలకు అతీతంగా జీవనం
### బోయిన్ పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్



**రసూల్‌పురా వార్డు 2లో మొహర్రం సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న టీఎన్ శ్రీనివాస్**

బేగంపేట జులై 29, ప్రభాతవార్త : కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రజలు కుల మతాలకు అతీతంగా జీవనం సాగిస్తుంటారని, ఇది ఎంతో మంచి సాంప్రదాయమని బోయిన్‌పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. మొహర్రం సందర్భంగా ఆయన రసూల్‌పురా వార్డు2లో ముస్లీం సోదరులతో కల్సి ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ సందర్భంగా మొహర్రం అంటే ముస్లీం సోదరులు ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహించుకుంటారని ఇది ఎంతో సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ ముదిరాజ్, నసర్, ఎండి గఫర్, షేక్ గౌస్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ
### బలోపేతం చేసే దిశగా అడుగులు : నేమూరి శంకర్‌గౌడ్



**కార్యకర్తలతో శంకర్‌గౌడ్**

కెపిహెచ్‌బి కాలనీ, జులై 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని నియోజకవర్గ జనసేన ఇంచార్జీ నేమూరి శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, విలువలను, పార్టీ సిద్ధాంతాలను నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ఉన్న ఇంటింటికి తీసుకువెళ్ళి బూత్ స్థాయిలో బలోపేతం చేయడం కోసం తెలంగాణ కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ కమిటీ సభ్యులను శనివారం నియమించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని యువకులను, పవన్ కళ్యాణ్ అభిమానులను, వీర మహిళలను జనసేన పార్టీలోకి ఆహ్వానించి యూత్ వింగ్, శక్తివంతమైన వీర మహిళ విభాగాలను నియమించి పార్టీని మరింత బలోపేతం చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**మొహర్రం పీర్లకు దట్టీలు సమర్పించిన బిఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి**

## గుర్తు తెలియని యువకుని మృతి



బేగంపేట జులై 29, ప్రభాతవార్త : గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 28వ తేదీన బ్లూకోల్ట్స్ విధులలో ఉన్న ఎన్.రామకృష్ణ డయల్ 100 కు కాల్ రావడంతో వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ పరిశీలించగా బేగంపేట ఫతేనగర్ కొత్త బ్రిడ్జి మార్గంలో నేచర్ క్యూర్ ఆసుపత్రి సమీపంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 సిబ్బంది ఆ యువకుడి ని పరి శీలింగా అప్పటికే అతను మృతి చెందినట్లు ధృవీకరించారన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.జయచందర్ తెలిపారు. అతని వంటిపై బ్లూకలర్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతిని ఆచూకి గుర్తించిన వారు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## పాడిరైతుకు ఆర్థిక సహాయం అందజేసిన కౌన్సిలర్లు



**రైతుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ**

దుండిగల్, జులై 29 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామానికి చెందిన పిట్ల శంకర్ గేదేలు ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సహాకారంతో కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ శనివారం తన కార్యాలయంలో రైతు శంకర్‌కు రూ,1లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న నిరుపేద రైతు శంకర్ గేదేలు మృత్యువాత పడడం బాధకరం అన్నారు. ప్రభుత్వం నుండి సాయం అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్ కుమార్, భరత్‌కుమార్, ఫాక్స్ డైరెక్టర్ వెంకటేష్, బిఆర్ఎస్ మున్సిపల్ జనరల్ సెక్రటరీ కొల్తూరి మల్లేష్, నాయకులు జక్కుల శ్రీనివాస్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, నాగరాజు, 3వవార్డు ప్రెసిడెంట్ నర్సింగ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాపురావు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

సైఫాబాద్, జులై 29 ప్రభాతవార్త: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావుకు వ్యతిరేకంగా శనివారం గన్‌పార్కులోని అమర వీరుల స్మారక స్థూపం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు, పార్లమెంట్ మాజీ సభ్యుడు రవీంద్రనాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ చేసిన చట్టాన్ని దిక్కరించి సోయం బాపురావు సోయలేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. దేశంలో 745 ఆదివాసీ గిరిజన తెగలు ఉన్నాయని ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆయన ఏలా మాట్లాడతారని ప్రశ్నించారు. బాపురావు వెనుక సిఎం కెసిఆర్ కుట్ర దాగి ఉందని, కెసిఆర్ కూడా కులాల మధ్యచిచ్చు పెట్టి పాలించే విధానమని ఆరోపించారు. ఒక ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత బిజెపిదని, బిజెపి అధిష్టానం అనుమతి లేకుండా ప్రకటన చేసిన బాపురావును తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పోరేటర్ లీలారవి నాయక్, బంజారా నాయకులు నెహ్రు నాయక్, అశోక్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

సైఫాబాద్, జులై 29 ప్రభాతవార్త: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను తక్షణమే నిరోధించి శాంతియుత వాతావరణ ఏర్పడేందుకు కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మణిపూర్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం పట్టించకోకపోవడం వల్లనే ఆనేకమంది ఆదివాసీలు చనిపోయారని, వేలాది గాయాలకు గురైనారని, భయం నీడలో ప్రజలు జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మారణహోమానికి కారణమైన దుండుగలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, అక్కడ శాంతిని నెలకోల్పి ప్రజలకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే మాధవరం పాదయాత్రను జయప్రదం చేయాలి
### కార్పోరేటర్ ముద్దం



**డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్పోరేటర్ ముద్దం**

బేగంపేట జులై 29, ప్రభాతవార్త : ఆగస్టు నెల 1వ తేదీ నుంచి ఓల్డ్‌బోయిన్ పల్లి 119డివిజన్ లో జరగనున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్రను జయప్రదం చేయాలని ఓల్డ్‌బోయిన్ పల్లి 119 డివిజన్ కార్పోరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. శనివారం డివిజన్ లో కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాదయాత్ర సమయంలో ఆయా బస్తీలకు వచ్చిన సమయంలో ప్రజల సమస్యలు ఎమైనా ఉంటే ఆయన దృష్టికి తీసుకు రావాలన్నారు. పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి సుధాకర్ రెడ్డి, నరేందర్‌గౌడ్, బలవంత్‌రెడ్డి, మక్కల నర్సింగరావు, కర్రె జంగయ్య, ఇర్ఫాన్, హరినాద్, లలిత, అనూరాధ, జాంగీర్, బుర్రి యాదగిరి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయడమే టిఎస్‌సి ముఖ్య ఉద్దేశ్యం : పుంజాల వినయ్ కుమార్



**విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుంజాల వినయ్ కుమార్**

ఫిల్మ్‌నగర్, జులై 29, ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయడమే తెలంగాణ సమాజ పార్టీ (టిఎస్‌సి) ముఖ్య ఉద్దేశ్యమని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ తెలిపారు. శనివారం ఫిల్మ్ నగర్‌లోని తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ గ్రౌండ్ జనరల్ కౌన్సిల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాజకీయంగా బలహీనవర్గాల అభ్యున్నతి, అభివృద్ధి తదితర అంశాలపై చర్చాగోష్టి ఉంటుందని తెలిపారు. ఈ చార్చగోష్టిలో బిజెపి, కాంగ్రెస్, టీడీపి, బిఎస్పి, తెలంగాణ జన సమితి, వామపక్షాలు ఇతర పార్టీల ప్రతినిధులు, నిబద్ధత కలిగిన సామాజిక కార్యకర్తలు, మేధావులు, నిపుణులు, విద్యావంతులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సమావేశంలో టిఎస్‌సి రాష్ట్ర నాయకులు డి.నరహరి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విస్తృత స్థాయి పరిశోధనలు

హైదరాబాద్, జులై 29, ప్రభాతవార్త: గట్‌మైక్రో బయోమ్‌పై జినోమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి పరిశోధనలు జరుగుతున్నాయని ట్రూత్‌ల్యాబ్ వ్యవస్థాపకులు డాక్టర్ గాంధీ అన్నారు. ఈమేరకు శనివారం బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవుని శరీరంలో కోట్లానుకోట్ల బ్యాక్టీరియా కణాలు ఉంటాయని శరీరానికి ఉపయోగకరమైన మంచి బ్యాక్టీరియా చెడు బ్యాక్టీరియాలు ఉంటాయన్నారు. శరీరంలో కలిగే పలువ్యాధులకు వీటిస్థాయిలో కలిగిన అసమతుల్యతలే కారణం అని పరిశోధకులు కనుగొన్నారని పేర్కొన్నారు. శరీరంలోని మంచి బ్యాక్టీరియాను పెంపొందించి శరీరంలో ఏర్పాడే వ్యాధుల నివారణకు జినోమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. గట్ మైక్రో బయోమ్ సహకారంతో పార్కిన్సన్, ఆటిజం, డెర్మటాలజీలోని పలు రోగాలకు పరిష్కారాలు కనుగోనేందుకు దోహదం చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఆవిధానంపై విస్తృతస్థాయి పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో జినోమ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కనకభూషణం, రూమటాలజీ వైద్యులు డాక్టర్ శరత్ చంద్రమౌళి పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 9,10 తేదీల్లో జాతీయ స్థాయి
## కరాటే, కుంగ్‌ఫూ పోటీలు



**టోర్నీ పోస్టర్, షీల్డ్‌లను ఆవిష్కరిస్తున్న సినీహీరో సుమన్, కరాటే రాజు తదితరులు**

హైదరాబాద్, జులై 29, ప్రభాతవార్త: సెప్టెంబర్ 9,10తేదీల్లో సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలను నిర్వహిస్తున్నటులన కరాటే గ్రాండ్ మాస్టర్ రాజు తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీహీరో సుమన్ చేతులమీదుగా టోర్నిపోస్టర్, షీల్డ్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రతి మనిషి ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. సమాజంలో అందరూ ఒకే తరహాలో ఉండరని కరాటే నేర్చుకోవడం అవసరమన్నారు. కరాటే మాస్టర్ రాజుకు వేలాదిమంది శిష్యులు ఉన్నారని ఈకార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహిస్తారన్నారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అందరూ కరాటే నేర్చుకోవాలని ఆయన కోరారు. ఈసందర్భంగా హీరోసుమన్‌ను కరాటే అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈకార్యక్రమంలో ఈగడి ఎల్లప్ప, కృష్ణగౌడ్, రవి, నాగేశ్వర్‌రావు, నరేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా మొహారం : క్రిషాంక్, జంపన



**బోయిన్‌పల్లి మొహారం వేడుకల్లో మన్నెక్రిషాంక్, జంపనప్రతాప్ తదితరులు**

అడ్డగుట్ట, జులై 29 ప్రభాతవార్త: హిందు, ముస్లింల సాంస్కృతిక ఐక్యతకు చిహునంగా మొహారం ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నెక్రిషాంక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్‌లు తెలిపారు. మొహారం పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం కంటోన్మెంట్‌లోని బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు జరుపుకునే మొహారం వేడుకలు కులమతాలకు అతీతంగా పాల్గొంటారన్నారు. ఈ క్యాక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు నజీర్, అమర్, పహీం, చోటు, హిలియాస్ పాల్గొన్నారు.



మాజీమంత్రి మూల ముఖేష్‌గౌడ్ చిత్రపటం వద్ద నివాళ్లు ఆర్పిస్తున్న ఎమ్మెల్యే టి.రాజాసింగ్, ఈ చిత్రంలో బిజెపి నాయకులు ఎం.విక్రమ్‌గౌడ్, కుటుంబ సభ్యులు

## కులాలను రెచ్చగొడుతున్న మోదీ ప్రభుత్వం
### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం**

కెపిహెచ్‌బి కాలనీ, జులై 29, ప్రభాతవార్త : దేశంలో మోదీ ప్రభుత్వం కులాలను మతాలను రెచ్చగొట్టి అమాయకులైన ప్రజల ప్రాణాలను తీస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనకు నిరసనగా కూకట్‌పల్లిలో 3వేల మంది క్రిస్టియన్‌ల ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం చాలా ప్రశాంతంగా ఉండేదని అన్ని కులాలు అన్ని మతాలవారు ప్రశాంతంగా జీవించేవారని అలాంటి ప్రజలను బిజెపి ప్రభుత్వం ఏర్పడిన 9ఏళ్ళలో కులాల మధ్య, మతాల మధ్య ప్రాంతాల మధ్య చిచ్చులు పెట్టి రెచ్చగొట్టి విభేదాలు తీసుకువస్తున్నారని ఆరోపించారు. మణిపూర్‌లో చర్చీలను కూల్చివేయడం క్రిస్టియన్‌లను బట్టలు లేకుండా రోడ్లపై నగ్నంగా నడిపించడం క్రిస్టియన్‌లను చంపేయడం చాలా బాధకరమైన విషయం అని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ అల్లర్ల విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, కూకట్‌పల్లి క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు డేవిడ్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి : రామక్రిష్ణ



**వ వార్డు జయనగర్‌లో బస్తీబాటలో ప్రసంగిస్తున్న బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తదితరులు**

కంటోన్మెంట్, జులై 29 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధి జరుగుతుందని, కంటోన్మెంట్‌కు సిఎం కేసిఆర్ ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదని బోర్డు సభ్యుడు జె.రామక్రిష్ణ తెలిపారు. శనివారం 1వ వార్డు జయనగర్‌లో లక్షలాది రూపాయల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం పనులను బిజెపి నేతలు బి.ఎన్.శ్రీనివాస్, బానుక మల్లికార్జున్, సుష్మిత, బాణాల శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం తాము చేపడుతున్న ఉద్యమాలతోనే రూ.46 కోట్లు తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లీడర్ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అథ్‌వాలే మైనార్టీ సెల్ ప్రసిడెంట్‌గా మహ్మద్ ఫయాజ్

బేగంపేట జులై 29, ప్రభాతవార్త : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అథ్‌వాలే తెలంగాణా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రశిడెంట్ గా బేగంపేట పాటి గడ్డకు చెందిన మహ్మద్ ఫయాజ్ ను నియమిస్తూ ఆ పార్టీ నేషనల్ సెక్రటరీ పేరం శివనాగేశ్వరరావు గౌడ్ నియామక పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా మహ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు పార్టీకి నమ్మకంతో సేవలు అందించానని, తనపై నమ్మకాన్ని ఉంచి బాధ్యతలు అప్పగించిన రాంధాస్ అథ్‌వాలే, పేరం నాగేశ్వరరావు గౌడ్‌లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. రానున్న రోజుల్లో తెలంగాణా రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేసారు. తనతో పాటు రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రశిడెంట్ గా మద్దిశెట్టి సామేలు, ఓబీసీ చైర్మన్‌గా నియమితులైన దేశగోని సంపత్ కుమార్ గౌడ్‌లకు మహ్మద్ ఫయాజ్ అభినందనలు తెలియజేసారు.

## దాశరథి, సినారెల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలి
### తెలంగాణ పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ధర్నాచౌక్, జులై 29, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ కవులైన దాశరథి కృష్ణమాచార్య, సీ.నారాయణరెడ్డిల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని తెలంగాణ పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం సీ.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం గవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాటి నిజాం పాలనపై ధిక్కార స్వరంతో తన రచనలతో, పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేసిన గొప్ప కవి దాశరథి అన్నారు. అదే విధంగా జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సాహితీవేత్త, సినీ గేయరచయిత అయిన సీ.నారాయణరెడ్డి తన రచనలతో ప్రజల మనసులలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఇటువంటి మహనీయుల విగ్రహాలను భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 1980 లో ఓయూలో విద్యార్థి సంఘానికి నాయకుడిగా తాను ఉన్న సమయంలో ఆ యూనియన్‌కి సలహాదారుగా సినారే ఉండి, ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

## అభివృద్ధిలో బండ్లగూడను అగ్రభాగంలో నిలుపుతున్నాము
### మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్



**బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని ఆరో వార్డులో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్**

నార్సింగి, జులై 29 ప్రభాతవార్త : అభివృద్ధిలో బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను రంగారెడ్డి జిల్లాలోనే అగ్రభాగంలో నిలుపుతున్నామని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కార్పోరేషన్‌లోని 6.వ, వార్డులోని 60.ఫీట్ల రోడ్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులను దూరం చేసేందుకు శక్తివంచన లేకుండా కష్ట పడుతున్నామని తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చొరవతోనే వేగంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని వివరించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పివిఎన్ఆర్ బ్రిడ్జి పిల్లర్ నెంబర్ 213.నుంచి రిచ్‌మండ్ విల్లాస్ వరకు 2.కిలో మీటర్ల దూరం రూ.10.కోట్లతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజి, మంచినీటి వసతులుంటే ఆ ప్రాంతంలోని భూములకు ధరలు పెరుగుతాయని, ప్రజలు ఆనందంగా ఉంటారని తెలిపారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడేది లేదని మేయర్ హెచ్చరించారు. గత వారం రోజులుగా వర్షాల కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. పని చేసే వారికి పట్టం కడితేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని, వచేనచ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో అసెంబ్లీకి పంపించాలని మహేందర్‌గౌడ్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఇ సత్యనారాయణ, ఎఇఇ మురళీకృష్ణ, సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్, హాఫీజ్‌ఖాన్, నాయకులు సుమన్‌గౌడ్, నదీం, షఫీ, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## బక్స్‌డ్రైన్ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదు
### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



**బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి**

తార్నాక, జులై 29 ప్రభాతవార్త: తార్నాకలో జరుగుతున్న బక్స్‌డ్రైన్ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం తార్నాకలో బాక్స్‌డ్రైన్ పనులను, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. లేని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు సూచించారు.

## ఘాన్సీబజార్‌లో వైభవంగా కలశ యాత్ర

చార్మినార్, జులై 29 ప్రభాతవార్త : అధిక మాసం సందర్భంగా శ్రీ హరి భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి ఆగష్టు నెల 6వ తేదీ వరకు ఘాన్సీ బజార్‌లోని వైదిక వచనాలయంలో జరగనున్న శ్రీ హరినామ్ అఖండ్ తాల్ సప్తాహ్ కార్యక్రమం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో శనివారం సాయంత్రం కలశ యాత్ర అత్యంత వైభవంగా జరిగింది. చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం వద్ద చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్ కలశ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవని తెలిపారు. చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం నుంచి ప్రారంభమైన కలశ యాత్ర పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం ఘాన్సీ బజార్‌లోని వైదిక వచనాలయానికి చేరుకుంది. కాగా మండలి ప్రతినిధులు పండిత్ విశేష్ శర్మ, టి.సునీల్ కుమర్‌తో పాటు వందలాది మంది మహిళలు ఈ కలశ యాత్రలో పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం



జీడిమెట్ల, జులై 29 ప్రభాతవార్త : పనికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన అనిమి అప్పారావు కుమారుడు సురేష్ (33) ఫతేనగర్‌లో ఐరన్ కట్టింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 26న ఉదయం 7:30గంలకు ఇంటి నుండి పనికి వెళ్లిన సురేష్ రాత్రి పొద్దుపోతున్న ఇల్లు చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులు, తెలిసిన చోట్ల ఆరా తీసని ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## షర్బత్ పంపిణీ

యూసుఫ్‌గూడ, జులై 29, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రహమత్‌నగర్ డివిజన్ బ్రహ్మ శంకర్ నగర్ చౌరస్తాలో టియస్‌యివిఐడిసి చైర్మన్ శ్రీరావుల శ్రీధర్‌రెడ్డిగారి నేతృత్వంలో రహమత్ నగర్ డివిజన్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు తంగెళ్ళ పల్లి లక్ష్మణ్‌గారి ఆధ్వర్యంలో హాజరత్ ఇమామ్ హుసేన్ త్యాగానికి గుర్తుగా జరుపుకునే మొహర్రం సందర్భంగా షర్బత్‌ని ఏర్పాటు చేసి, డివిజన్ మైనారిటీ నాయకులు మహ్మద్ షేర్ అలం, మహ్మద్ అహ్మద్‌ల ద్వారా పంపిణీ చేయించడం జరిగింది. ఈసందర్భంగా తంగెళ్ళపల్లి లక్ష్మణ్ గారు మాట్లాడుతూ మొహర్రం అంటే త్యాగానికి ప్రతీక సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం అనీ రాష్ట్రంలోని ప్రజలందరూ కులమతాలకు అతీతంగా జరుపుకుంటారని అన్నారు. ఈకార్యక్రమంలో మహ్మద్ జలాల్, సల్మన్, నదీమ్ బోడ రవికుమార్, విజేష్, రాహుల్, ఆకాష్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మోహితుల్ని చేసిన రాధామోహనం నృత్యరూపకం


రాధామోహనం నృత్యరూపకంలో దృశ్యం

రవీంద్రభారతి, జూలై 29 ప్రభాతవార్త : ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రాధా నృత్యనిలయం ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో శనివారం ఉదయం సంస్థ 21వ వార్షికోత్సవ సందర్భంగా గురుపరంపరలో భాగంగా భరతనాట్య శైలిలో రాధామోహానం నృత్యరూపకం రసోస్పాదనతో నృత్యసౌర భాలను విరజల్లుతూ విచ్చేసిన అశేష ప్రేక్షకులను, ఔత్సాహిక కళాప్రియులను ఆకట్టుకొని సమ్మోహితుల్ని చేసింది. సాయిదీత్య, సహస్ర, శ్రితశర్మ, వర్షిణి, సంస్కృతి, వర్షిత, తనుశ్రీ, ఆర్షిత, వైశాలి, హారిక, అక్షర తదితర చిన్నారి కళాకారులు వివిధ పాత్రల్లో నృత్యాభినయంతో ఆహుతుల హర్షధ్వానాల మధ్య మన్ననలు, శుభాశీస్సులు అందుకున్నారు. తదనంతరం ప్రముఖ గురువులు భాగవతుల సేతురాం నాట్యాచార్యులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం; కందుకూరి వరలక్ష్మి ప్రిన్సిపాల్ భక్తరామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల; మంజుల శ్రీనివాస్ ప్రభుత్వ ఎస్‌బిఆర్‌ఖ సంగీత నృత్యకళాశాల పూర్వాచార్యులు; పాండురంగ ముతలిక్ ప్రిన్సిపాల్ ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల మంథని; సిరిపల్లి నాగేశ్వరరావు మృదంగ విద్వాంసులు ప్రభుత్వ త్యాగరాజ, ఎస్‌బిఆర్ సంగీత నృత్యకళాశాలలు, ఏపి జన్‌కో మాజీ డైరెక్టర్ జి.వి.అప్పారావు, వాసవిక్లబ్స్ పూర్వ డైరెక్టర్ టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మర్రి లక్ష్మణ్‌రెడ్డి


మర్రి లక్ష్మణ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీధర్‌రావు

దుండిగల్, జులై 29 ప్రభాతవార్త : తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా అంతర్జాతీయ అథ్లెట్, ఎమ్మెల్లార్ గ్రూప్స్ అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డిని నియమించినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధితో పాటు క్రీడలకు మొదటి నుండి మంచి ప్రాధాన్యతనిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి అసోసియేషన్ చైర్మన్‌గా నియమించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పలు క్రీడలోన్ల అపార అనుభవం ఉన్న ఆయన సైక్లింగ్, స్విమ్మింగ్, రన్నింగ్ మొదలగు వాటిలో అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీలలో పాల్గొని అనేక విజయాలను సొంతం చేసుకున్నారన్నారు. ప్రతిరోజు యోగ చేస్తుంటారని, ఆయన ఆధ్వర్యంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సైతం రాష్ట్ర, జాతీయస్థాయిలో ముందుకెళ్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ నేను వివిధ క్రీడలోన్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి ఆసక్తితో పాటు నా ఫిట్‌నెస్‌కి యోగ ప్రధాన కారణమని, యోగాసనా పోటీలను తెలంగాణలోని అన్ని జిల్లాలో మిగతా క్రీడల వలె అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానన్నారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షులు రామచంద్రం, జాయింట్ సెక్రటరీ రాంరెడ్డి, సతీష్, గోపాలక్రిష్ణ, కోశాధికారి రాజారెడ్డి, మెహన్‌లు లక్ష్మణ్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు


కాంగ్రెస్ పార్టీ షేక్‌పేట్ అధ్యక్షునిగా సత్యనారాయణను నియమించబడిన సందర్భంగా అభినందిస్తున్న జూబ్లిహిల్స్ మాజీ శాసన సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, జూలై 29, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఎపుడు ఉంటుందని జూబ్లిహిల్స్ మాజీ శాసన సభ్యులు పి. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా దరుగుపల్లి సత్యనారాయణను అధ్యక్షునిగా నియమించడంతో మర్యాద పూర్వకంగా నియోజక వర్గం మాజీ శాసన సభ్యులు పి.విష్ణు వర్ధన్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఆయనను అభినందించారు. అహర్నిశలు ప్రజా సమస్యల కోసం పోరాటం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నందుకు తన సేవలను గుర్తించి తనకు ఈపదవి ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషిచేస్తానని సత్యనారయణ పేర్కొన్నారు. ఈసందర్భంగా తనకు ఈపదవి ఇచ్చినందుకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్‌కు సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షులు అనీల్‌కుమార్ యాదవ్‌కు మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రమేష్, సత్యనారాయణ, నవీన్, కన్నా, విక్టరీ రాజా, అశోక్,, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ వినీలాకాశంలో ధృవతారగా వెలిగిన మహాకవి సినారె


ప్రముఖ గాయని 'శివశంఖరి' గీతాంజలికి 'సి.నారాయణరెడ్డి-జిఎస్.ఆర్ట్స్ మ్యూజిక్ అవార్డు-2023' అందిస్తున్న వంశీరాజు

చిక్కడపల్లి 29 ప్రభాతవార్త: తెలంగాణ సాహితీ శిఖరం డాక్టర్ సి.నారాయణరెడ్డి అని వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. విశ్వంభర కావ్యంతో, తెలంగాణ సాహితీ పరిమళాన్ని, తన సాహిత్యంతో విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సినారె అని అన్నారు. శనివారం ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లోని సిటీ కల్చరల్ కేంద్రంలో జిఎస్.ఆర్ట్స్ ఆధ్వర్వర్యంలో నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతి సందర్భంగా జరిగిన సభలో ప్రముఖ గాయని 'శివశంఖరి' గీతాంజలికి 'డాక్టర్ సి.నారాయణరెడ్డి-జిఎస్.ఆర్ట్స్ మ్యూజిక్ అవార్డు-2023' ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, గాయని, రచయిత్రి డాక్టర్ సువర్ణలత, ప్రముఖ కవయిత్రి ఇందిర ఆర్ట్స్ ఫౌండేషనణ్ అధ్యక్షురాలు ఎన్.ఇందిర, భాగంగా సినారె రచించిన పాటలను గాయకుడు జి.శ్రీనివాస్ నిర్వహణలో గాయనీ గాయకులు రాగరేఖ, అరుణ, లత, చైతన్య, నిర్మల, జ్యోత్స్న, లక్ష్మీరత్నం, రవికుమార్, సత్యం వంశరాజ్, సివి.రావు, సురేశ్, రవిమన్యు అద్భుతంగా గానం చేశారు. కరోవోకే సహకారాన్ని ప్రముఖ గాయకుడు బాపిరాజు అందించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పిఎంకె.గాంధీ వ్యవహరించారు.

## విజువల్ ఎఫెక్ట్ యానిమేషన్‌కు మంచి భవిష్యత్ ఉంది

ఐటి కార్యదర్శి జయేష్ రంజన్



మాట్లాడుతున్న ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్, చిత్రంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి, మైక్ యాథమ్

నాచారం, జులై 29 ప్రభాతవార్త: విజువల్ ఎఫెక్ట్ యానిమేషన్‌కు మంచి భవిష్యత్ ఉందని ఐటి కార్యదర్శి జయేష్ రంజన్ పేర్కొన్నారు. మాల్లాపూర్‌లోని విఎన్ఆర్ గార్డెన్‌లో రోటోమేకర్ విఎఫ్ ఎక్స్ 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటి ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ రోటోమేకర్ ఎంతో మందికి శిక్షణనిచ్చి వారి భవిష్యత్ కోసం కృషి చేయడం గొప్పవిషయం అన్నారు. నేడు ప్రజలు డిజిటల్ ఎంటర్‌టైన్ మెంట్‌ను ఎంతో ఆదరిస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఉపయోగ పడే టెక్నాలజీ ఇంకా పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబద్ నేడు ఆనిమేషన్, మల్టిమిడియా, ఐటి హబ్‌గా మారిందన్నారు. ఈ రంగానికి ప్రభుత్వం కూడా ప్రోత్స హిస్తుందన్నారు. నగరానికి నేడు ప్రపంచంలోనే ఇన్నోవేషన్ హాట్ స్పాట్‌గా రాష్ట్రానికి గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం హుజుర్‌నగర్ ఎమ్మెల్యే సైది రెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఐటి రంగం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. రోటోమేకర్ సంస్థ ఎంతోమందిని ఈ రంగంలో తీర్చిదిద్దడం అభినందనీయం అన్నారు. రోటోమేకర్ వ్యవస్థాపకులు, సీఈవో మైక్ యాథమ్(మాదవరెడ్డి) మాట్లాడుతూ విజువల్ ఎఫెక్ట్, యానిమేషన్‌కు మన దేశం కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆసియాలో అతిపెద్ద డిజిటల్ ఎంటర్‌టైన్ మెంట్ ఫెస్టివల్‌ను నగరంలో జరుగబోతుందన్నారు. తమ సంస్థ గ్లోబల్ మార్కెట్‌లో స్థిరంగా ఉంటూనే సృజనాత్మకత, సాంకేతిక నైపున్యానికి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సిప ఫౌండర్ కె. బాసి రెడ్డి, గోల్డ్ ఆనిమేషన్ చైర్మన్ రాజీవ్ చిలుకల, సీఈవో శ్రీధర్ ముప్పిడి పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తాం

గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్ హెచ్చరిక

చిక్కడపల్లి, జూలై 29ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని దోబీఘాట్, అరుంధతినగర్, సబర్మతినగర్ బస్తీలో సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌తో కలిసి పర్యటించారు. కార్పొరేటర్ పావనీ వినయకుమార్ మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి ప్రణాళికలేకుండా నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణంలో అన్ని అవకతవకలే జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. నాణ్యత లేకపోవడంతో వరదనీటి సమస్య బస్తీలకు తప్పడం లేదని ఆరోపించారు. డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, నేతలు శ్రీకాంత్, సత్తిరెడ్డి, నర్సింహా, శ్రీనివాస్, సురేశ్, ముత్యాలు, ఆనంద్‌రావు, చంటి, ప్రకాశ్‌యాదవ్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కొంపల్లి, జులై 29 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి ఓర్వలేక ఇతర పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ మండిపడ్డారు. మున్సిపల్ పరిధి అపర్ణఫామ్‌గ్రోవ్ కాలనీలో అధ్యక్షులు సంగీతారెడ్డి ఆధ్వర్యంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపర్ణలేఅవుట్‌లో దాదాపు రూ,10కోట్ల70లక్షల నిధులతో మంచినీటి వాటర్‌ట్యాంక్ నిర్మాణం చేశామని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు మొదటి విడతగా రూ,2కోట్ల80లక్షలు, రెండవ విడతగా రూ,1కోటి20లక్షలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రతి వార్డులోని దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తు పనులు వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిని చూసిన ఇతర పార్టీల నాయకులకు ప్రశ్నించడానికి ఏమి లేకపోవడంతో పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డిపై అరోపణలు చేస్తే సహించేది లేదు : దేవుడు


విలేకర్ల సమావేశంలో కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు డి.బి.దేవేందర్ తదితరులు

కంటోన్మెంట్, జూలై 29 ప్రభాతవార్త: టీపిసిసి అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డిపై లేనిపోని ఆరోపణలు బిఆర్ఎస్‌కు, బిజెపీలకు తగిన గుణపాఠం చెబుతామని కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి.బి.దేవేందర్ (దేవుడు) హెచ్చరించారు. శనివారం 4వ వార్డు లక్ష్మి నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మిస్సింగ్ అయినట్లు వాల్ పోస్టర్లు వేయడం సరైందికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపీలు ఓడిపోతామన్న భయంతో రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.డి.నాగేశ్ యాదవ్, గజ్వేల్ భరత్, అడ్వకేట్ వినేయ్, డి.బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమావతిపేట్‌లో పీర్ల ఊరేగింపు


పీర్ల కొలను ఊరేగింపులో పాల్గొన్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 29 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేట్‌లో శనివారం మొహర్రం సందర్భంగా పీర్ల కొలను ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిహెచ్‌ఎంసి కౌన్సిల్ విప్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాటా్లడుతూ ప్రజలు ఎంతో ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని తెలిపారు. సురేష్ ముదిరాజ్, సేలం, అన్వర్, మహ్మద్ గౌస్, హాసన్, అబ్దుల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మొహరం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి : శ్రీగణేష్

కంటోన్మెంట్, జూలై 29 ప్రభాతవార్త: మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని లాలాగూడ, తాడ్‌బండ్, సిఖ్ విలేజ్, ప్రాంతాల్లో జరిగిన మొహరం వేడుకల్లో బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ పాల్గొని ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ మొహరం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు ఖాజా, సలీమ్, అన్వర్, నజీర్, గౌస్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం సరస్వతి సంగీత నృత్యోత్సవం


ఆత్మీయ సత్కార గ్రహీతలతో రంగరాజన్, ప్రతిమ, శశిధర్ తదితరులు

నాంపల్లి, జూలై 29 ప్రభాతవార్త : ప్రముఖ సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శనివారం రాత్రి సంస్థ 21వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నేత్రపర్వంగా సాగాయి. సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గురువు ప్రతిమ శశిధర్ నేతృత్వంలో ముందుగా వీణా వాద్యకచేరితో ప్రారంభమై భరతనాట్యం, వయోలిన్, గాత్రం, కీబోర్డులపై వివిధ వాగ్గేయకారుల కృతులు తదితరాలతో దాదాపు 300మంది విద్యార్థినీ విద్యార్థులు అద్భుత ప్రదర్శనలివ్వగా ఈ వేడుకల్లో మొత్తం 800మంది వివిధ కళాకారులు పాల్గొనడం విశేషం. కళాప్రదర్శనల అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన చిలుకూరు రంగరాజన్, రమ రావి, ఒరుగంటి ఆనందమోహన్, సునీత కెవస్ రావు, సంగీత విద్వాన్ జొన్నలగడ్డ సత్యశ్రీరామ్, ప్రముఖ న్యాయవాది, సినీకళాకారుడు సివిఎల్.నరసింహారావు తదితరులు జ్యోతిప్రకాసనంచేసి మాట్లాడుతూ సరస్వతి సంగీత నృత్యశిక్షణాలయం గత 20 సంవత్సరాలు నిర్విరామంగా వేలాదిమంది విద్యార్థులకు మన భారతీయ కళల్లో శిక్షణనిస్తూ కళా సంస్కృతిని సుసంపన్నం చేస్తున్న ప్రతిమ శశిధర్‌ను ఎంతగానో అభినందించారు.


ఈనెల ఆగష్టు 6న వికలాంగుల వాక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎంఎ ఫౌండేషన్ ఇండియా నిర్వాహకులు

## తెలుగు సినీ, సాహితీ శిఖరం సినారె : ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త: తెలుగు సినీ, సాహితీ శిఖరం డాక్టర్ సి.నారాయణరెడ్డి అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శనివారం వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ వీడీ.రాజగోపాల్ ఆధ్వర్యంలో మహాకవి, జ్ఞానపీఠ అవార్డుగ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా కవిసమ్మేళనం కార్యక్రమం సామాజిక మాధ్యం(జూమ్) ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ విశ్వమానవ హృదయాంతరాలల్లోని చైతన్య జలపాతాల సవ్వడినీ, విప్లవ జ్వాలల వేడినీ రంగరించి కవితా జగత్తులో మానవతా దృక్పథానికి మనోజ్ఞరూపాన్ని దిద్దిన శిల్పి సినారె అని అన్నారు. పద్యం నుంచి గేయానికి, గేయం నుంచి వచనానికి అభ్యుదయాన్ని సాదిస్తూ పట్టింది బంగారంగా, పలికింది కవిత్వంగా ప్రగతి సాధించారన్నారు. మనిషిలోని మమతను, బాధను కన్నీటిని తన రచనల ద్వారా తెలుగుజాతికి అందించారన్నారు. వీడీ.రాజగోపాల్ మాట్లాడుతూ సినారె రచనల్లో మధ్యతరగతి కష్టసుఖాలే ఎక్కువగా కనిపిస్తాయన్నారు. ప్రముఖ రచయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి మాట్లాడుతూ సినారె కలం నుంచి పద్య, గేయ, వచన కవితలు గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్ర కథలు, గజళ్ళు, వ్యాసాలు, విమర్శ గ్రంథాలు, అనువాదాలు వెలువడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు బిక్కి కృష్ణ, రవీంద్రబాబు అరవా, ఆళ్ళ నాగేశ్వరరావు, ఆచార్య సోమయాజుల ప్రసాద్, ఓ.కృష్ణ, దేవి గాయత్రి, లోకనాథం, గోగు వెంకటేశ్వర్లు, కళాగోపాల్ ఎం.మంజులారాణి, కావుటూరి వసుంధర తదితరులు పాల్గొని తమ అమూల్యమైన కవితలను వినిపించారు.

## అడ్డగుట్టలో వందపడకల ఆసుపత్రి నిర్మించే వరకు పోరాటం చేస్తాం : సిపిఎం డిమాండ్

అడ్డగుట్ట, జూలై 29 ప్రభాతవార్త: దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టలో వంద పడకల ఆసుపత్రి నిర్మించే వరకు పోరాటం చేస్తామని సిపిఎం గ్రేటర్ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.వెంకటేశ్, సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్ బాబులు హెచ్చరించారు. శనివారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అడ్డగుట్టలో యాభై పడకల ఆసుపత్రి నిర్మించేందుకు గత 15 సంవత్సరాల నుంచి రెండు దఫాలు పనులు ప్రారంభించారని అవి నేటికి మోక్షం జరగలేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కెటాయించిన స్థలంతో పాటు వేల కోట్ల రూపాయల విలువ చేసే వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు మహేంద్రహిల్స్‌లో అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. సర్వే నెం 74,844పై 1లలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అడ్డగుట్టలో పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని వంద పడకల ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.మల్లేశ్, ఆర్.వీరలక్ష్మి, ఎన్.గోపాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేద, అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

టిపిసిసి ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ


కాలనీల్లోని ప్రజలతో మాట్లాడుతున్న కోటనీలిమ

హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త: అసంఖ్యాక సంక్షేమ పథకాలు, పేదరిక నిర్మూలన, జాతీయ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ మిషన్, కనీస గ్రామీణ ఉపాధి హామీ, సామాజిక అభ్యున్నతి, అందరికీ విద్య వంటి అనేక అభివృద్ధి పథకాలు కాంగ్రెస్ పార్టీయే ప్రవేశపెట్టి అమలు చేసిందని, పేద అణగారిన వర్గాల అభ్యున్నతికి కోసం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో పనిచేస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కోట నీలిమ అన్నారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పలుకాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకు న్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ధ్వంసమైన రహదారులు, పొంగిపొర్లుతున్న నాలాలు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల లేమితో బిఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ నాశనం అవుతుందని ఆరోపించారు. లో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, హక్కు సంస్థ వాలంటీర్లు సుధీర్‌కుమార్, ఖుర్షీద్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులతో చట్టప్రకారం పని చేయించాలి


కార్పొరేటర్‌కు తమ బాధలు తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

హైదరాబాద్, జులై 29 ప్రభాతవార్త: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్‌తో చర్చలు జరిపి న్యాయం జరిగేలా చూస్తానని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహలక్ష్మీరామన్‌గౌడ్ హామీ ఇచ్చారు. కమీషనర్ ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ టైమింగ్‌లో మార్పు, సెలవు రోజుల్లో కూడా పనిచేయాలని ఆదేశాలు జారీ చేయడంతో కార్మికులు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈసందర్భంగా మహలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు సెలవులు లేకుండా పనిచేయించడమంటే ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించడమే అవుతుందన్నారు. కార్మిక చట్ట ప్రకారమే కార్మికులతో పనిచేయించుకోవాలని ఆమె కోరారు. త్వరలో కమీషనర్‌తో చర్చిస్తామన్నారు.

### టీఎస్ సెట్ 2023 నోటిఫికేషన్ విడుదల

తార్నాక, జులై 29 ప్రభాతవార్త: టీఎస్‌సెట్, ఓ.యూ 2023 నోటిఫికేషన్‌ను ఓ.యూ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజీల ఉపాధ్యాయుల కోసం అర్హత సాదించేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. పేపర్1లో 50ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్ 2లో 100 ప్రశ్నలకు 200 మార్కులను కేటాయించారు.



సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మానసిక సమస్యలపై పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ స్వప్న

### స్వచ్ఛ ఆటో కార్మికులకు హెల్త్‌కార్డులివ్వాలి

చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరానికి క్లీన్‌సిటీగా ఉండడానికి కొత్తగా 2500 ఆటోలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ కోరారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో శనివారం తెలంగాణ స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ భవిష్యత్ కార్యాచరణ కోసం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో యూనియన్ జిహెచ్‌ఎంసి విభాగం అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి హంసరాజ్, అర్జున్, శేఖర్, పరుశురామ్, ప్రవీణ్, ఫకీరప్ప, మచ్చగిరి, శివ, ప్రభాకర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎసిపిని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



చాంద్రాయణగుట్ట, జూలై 29 ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసిపి పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.మనోజ్ కుమార్‌ను చాంద్రాయణ గుట్ట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముప్పిడి సీతారాం రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లలితాబాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు రాఘవేందర్ రాజు, చాంద్రాయణగుట్ట డివిజన్ ప్రధాన కార్యదర్శి టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### సిఎం కెసిఆర్‌పై రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, జులై 29 ప్రభాతవార్త:నల్లకుంటకు చెందిన రచయిత నేలంటి మధు సిఎం కెసిఆర్‌పై రచించిన 'ఉద్యమ నేత ... సంక్షేమ ప్రదాత', 'దేశానికి దిక్సూచి కెసిఆర్' అనే రెండు పుస్తకాలను శనివారం అంబర్‌పేట నియోజవర్గానికి చెందిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గోల్నాక క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు పుస్తకాలను రచించిన మధును అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను రిచించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అల్వాల్ సర్కిల్ డిసిగా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



అల్వాల్, జూలై 29 ప్రభాతవార్త: అల్వాల్ సర్కిల్ డిసిగా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం లీగల్ విభాగంలో ఇంత వరకు ఆయన పని చేశారు. సర్కిల్ డిసిగా గత రెండేళ్ళుగా పని చేసిన నాగమణి కుద్బుల్లాపూర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. సర్కిల్ సమాగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డిసి తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రజలు సహాకారంతో ముందుకు సాగుతానని చెప్పారు.

IN THE COURT OF THE HON BLE III SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT SECUNDERABAD
O.S. No.379 OF 2018

Between:
C.S.Mukund Rao & others ...Plaintiff
AND
Guda Satyanarayana & others ...Defendants

To,
The Legal Representatives Or authorized persons if any of Sri Guda Nandhivahan (died) S/o. Late. G. Babu Rao, R/o. H.No. 12-14-221, Old No. 2-2, Vinobha Nagar, Lalapet, Secunderabad.
Please take notice, that the Plaintiffs filed the above suit against the defendants for Declaration and Perpetual Injunction to declared them as owners and possessors of the house bearing Municipal Door No. 12-14-221 (old house No.2-2), with a built up area 200sft with land admeasuring 160 Sq. Yds, situated at Vinobha Nagar, Lalapet, under GHMC, Secunderabad Circle, Secunderabad, Telangana State, by declaring the AGPA dated 26-07-2010 in Doc. No. 1444/2010 registered at SRO Marredpally as sham, nominal and not binding on them. The above suit is posted to 01-08-2023. During the pendency of the above suit it was reported that the Defendant No.2 i.e., Sri. Guda Nandhivahan died without any legal heirs. Therefore the legal heirs or authorized persons of Sri. Guda Nandhivahan if any have any objections are hereby call upon to enter their appearance on his behalf on 01-08-2023 at 10:30 a.m. either in person or through an Advocate, failing which the above suit stands dismiss against Sri. Guda Nandhivahan.
//By order of the Court//
B.HARI KRISHNA, Advocates,
H. No.2-4-69/1/B, Gandhinagar Uppal, Hyderabad-500039. Phone-9160803007.

PUBLIC NOTICE

General public are hereby informed that my clients Mohammed Sadiq Slo Mohammed Abdul Rasheed Aged About: 44 Years, Occ: Business, R/o H.No: 12-5-32/ 15/2, South Lallaguda, Opposite: Bachpan School , Tarnaka, Secunderabad, Hyderabad-500017 and Smt. Sirisha Chimakurti D/o Sitaramaiah, Aged about: 45 years, Occ: Business, R/o Plot No. 15, GVR Enclave, Sailent Avenue, Dammaiguda, Nagaram, Keesara Mandal, Medchal Malkajgiri District entered into Agreement of Sale with the Vendors 1.) Morgu Dhsharatha S/o Late Morgu Kistaiah Aged about: 33 years, Occ: Business, R/o H.No: 5-54, Keesara Village and Mandal, Medchal Malkajgiri Distrtict 2) Panduga Raju S/o Late Panduga Narshima Aged about: 32 Years, Occ: Business, H.NO: 4-60, Keesara Village and Mandal Medchal Malkajgiri Distrtict, 3) Morgu Bhagyamma W/o Late M. Balaiah Aged about: 49 years, Occ: House Wife, R/o H.No: 5-112, Keesara Village and Mandal, Medchal Malkajgiri Distrtict 4) Pandru Satyamma W/o Late Pandru Yadaiah Aged about: 60 years, Occ: House Wife R/O H.no: 5-56, Keesara Village and Mandal Medchal Malkajgiri Distrtict on 19-01-2023 for all that the Agricultural Land, in Old Survey No: 348, New Survey No. 182/అ, 182/A/ఉ, 182/A/ఈ, 182/ఉ, 182/ఉ, 182/ఇ, 182/B/ఈ, 182/B/అ, 182/లు, 182/రు, 182/B/ఇ, 182/B/ఈ, 182/B/ఉ, 182/A/అ, 182/A/ఇ, 182/A/ఇ/2, 182/B/ఉ, Total Extent of Ac. 12.34 1/2 Guntas: situated at Keesara Mandal, Dayara Village, Medchal Malkajgiri District and bounded on North: 100 Feet Wide Main Road, South: Land Survey No. 173, 174, 175 Parts, East: Current Sub Station, West: Rice Gowdown. Furthermore, there was some disagreement between the parties, as a result of which they seek to cancel the agreement of sale with the property's owners.
J. SRINIVAS M.Sc., LLM
ADVOCATE
H.NO. 17-705/1, INDIRA NEHRU NAGAR, MALKAJGIRI, HYDERABAD - 47.
CELL: 9676299867 / 7799088997
EMAIL : CNU198126@GMAIL.COM

IN THE COURT OF HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT: AT: HYDERABAD
EP No.14 of 2022
In
O.S. No.674 of 2021

Between:
Smt.Boga Krishnaveni & Another
Decree Holder
And
J. Sridhar
Judgment Debtor

To
Jupally Sridhar, S/o. J.Rameshwariah, Aged 45 years, Occ: Business, R/o. P.No.92, Annapurna, Sai Ram Nagar, Bandlaguda, Jagir, Hyderkote, Golconda, Hyderabad-500 091
Please take notice that the decree holder filed above EP against Judgment Debtor in respect of above suit decreed in favour of the Decree holder. The case is posted on 4-8-2023 for your appearance and If you fail to appear on the said date, the matter will be decided accordingly..
// BY ORDER OF THE HON'BLE COURT//
A.SANJEEVA NARAYAN
Advocate
B.A., LL.B
Office: 1-9-18/2/5
Ramnagar X Roads
Ramnagar,
Hyderabad-500 020
Cell:93485-89496

# రూ.వెయ్యి కోట్ల వరద సహాయం ప్రకటించాలి : రేవంత్‌రెడ్డి



ఎలివేటెడ్ కారిడార్ పనుల వివరాలు తెలుసుకుంటున్న పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి

**ఉప్పల్, జూలై 29 ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ తెలంగాణ ప్రజల ప్రాణాలపై లేదని టిపిసిసి చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులను పలువురు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలపై వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్రం తక్షణ సహాయం కింద రూ.వెయ్యి కోట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. వరద ముప్పుపై సమీక్షలు చేయకుండా సిఎం కెసిఆర్ రాజకీయాలపై దృష్టి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం చచ్చిపోయిందని, ప్రజలు వరద నీటితో ఇబ్బంది పడుతుంటే సిఎం కెసిఆర్ ఫామ్ హౌజ్‌లో నిద్రపోతున్నారన్నారు. రాష్ట్రంలో వరదల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సిఎం కెసిఆర్,మంత్రి కేటిఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. బస్తీలలో సిఎం, మంత్రులు ఎందుకు పర్యటించడం లేదన్నారు. సిఎం కెసిఆర్ మహారాష్ట్రలో రాజకీయాలు చేస్తూ ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఎలివేటెడ్ కారిడార్ కట్టకపోవడం వల్ల 20 మంది చనిపోయారని, ప్రగతిభవన్‌లో కుక్క చనిపోతే డాక్టర్లపై కేసులు పెట్టారని, కారిడార్ పనుల నిర్లక్ష్యంతో ప్రజలు పోతుంటే వారి ప్రాణాలకు విలువలేదా అని ప్రశ్నించారు. తెలంగాణను డల్లాస్, ఇస్తాంబుల్ చేయకున్న పరువాలేదు కాని అర్భాటపు ప్రకటలు మానుకుని సిఎం కెసిఆర్ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని విన్నవించారు. మూడు నెలల్లో సిఎం కెసిఆర్ ఇంటికి పోతున్నాడని, అందుకే రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలను పట్టించుకోని నేతలను ఉరివేసినా తప్పులేదన్నారు. సోమవారంలోగా పనులు చేపట్టాలని, లేకుంటే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో 3వేల కోట్ల పంట నష్టం జరిగిందని, 30 మంది ప్రాణాలు కోల్పోయారని, చనిపోయిన వారికి రూ.25లక్షల పరిహారం, పంట నష్టానికి ఎకరాకు రూ.30వేల సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి, బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. డిల్లీకి వెళ్లి నిధులు తీసుకుని రావచ్చుకదా అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, ప్రజలు వీరిని గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీశ్రేణులు వరద సహాయక చర్యలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆర్అండ్‌బి చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డిని ఫోన్‌లో మాట్లాడి వెంటనే పనులు చేపట్టాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి నేతలు మల్లు రవి, డిసిసి అధ్యక్షుడు శ్రీధర్, ఉప్పల్ కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉప్పల్‌లో కాంగ్రెస్‌లో నేతల మధ్య భగ్గుమన్న విబేదాలు..!**

ఉప్పల్‌లో పిసిసి చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఉప్పల్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రోటోకాల్ పాటించడం లేదని కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి వర్గీయులు ఫ్లెక్సీలు చింపివేశారు. దీనిపై ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ గొడవలో ఒక జర్నలిస్టుతోపాటు ముగ్గురు యూత్ కాంగ్రెస్ నేతలకు గాయాలు అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొడవ పడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలను నిలువరించే క్రమంలో ఒక కానిస్టేబుల్ కిందపడి గాయపడ్డారు. నేతల గొడవలతో ఉప్పల్‌లో మరోసారి కాంగ్రెస్ పార్టీలో వర్గ విబేదాలు భగ్గుమన్నాయి.

## ఇల్లు లేని పేదలకు ఉచితంగా ఇంటి స్థలాలు: కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలకు ఉచితంగా ఇంటి స్థలాలను పంపిణీ చేస్తున్నామని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, కెఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్‌కు చెందిన డి.జయశ్రీ మనోహర్‌లకు శనివారం ఆయన తన నివాసంలో 60 గజాలకు సంబంధించిన ఇంటి స్థలం డాక్యుమెంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ సమీపంలోని తన స్వంత భూమి నుండి ఉచితంగా ఇంటి స్థలాలను ఇస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు అండగా ఉండి ఆదుకోవడమే తన లక్ష్యమని మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో గ్రంథాలయాలకు మహర్దశ : ఛైర్మెన్ వెంకటరమణారెడ్డి



గ్రంథాలయాల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

**తుర్కయంజాల్, జూలై 29 ప్రభాతవార్త :** గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గ్రంథాలయాల వ్యవస్థ చిక్కి శల్యమైందని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో గ్రంథాలయాలకు మహర్దశ పట్టిందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిదిలో అధునాతన గ్రంథాలయాన్ని నిర్మించడానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిదులతో కలిసి స్థల పరిశీలన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 25 గ్రంథాలయాలు ఉండగా, ఆరు నెలల వ్యవదిలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేల సహకారంతో 30 గ్రంథాలయాలను ఏర్పాటు చేసామన్నారు. మరో 30 గ్రామీణ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామన్నారు. అమెజాన్ సంస్థ సహకారంతో జిల్లాలో పది గ్రంథాలయాల నిర్మాణం జరుగుతుందని వీటి నిర్వహణకు గ్రంథాలయ సంస్థ చర్యలు చేపట్టనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్‌నాయక్, నాయకులు రొక్కం చంద్రశేఖర్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, కాకుమాను, చిన్నయ్య, గుండా ధనరాజ్, నారని శేఖర్ గౌడ్, పుల్ల పర్రం విజయానందరెడ్డి, బొక్క గౌతమ్‌రెడ్డి, గౌని వినోద్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీకాంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మొక్కల పంపిణీ : నంబూరి కృష్ణంరాజు

**కుషాయిగూడ, జూలై 29 ప్రభాతవార్త :** ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం పది గంటలకు జరుగుతుందని పర్యావరణ సంరక్షకులు అనేక లక్షల మొక్కల దాత నంబూరి కృష్ణంరాజు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ ఈశ్వరపురి కాలనీ గణేష్ మార్బల్ ప్రక్కనగల జిహెచ్ఎంసి పార్కులో నేరేడు, మారేడు, ఉసిరి, పనస మొక్కలతో పాటు పిచ్చుక గూళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ : పోలీసులు

**కుషాయిగూడ జూలై 29 ప్రభాతవార్త :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ఐదుగురు బాధితులకు అందజేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పరిధిలో సెల్ ఫోన్లు కోల్పోయిన బాధితులు (సి ఈ ఐ ఆర్) సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో పోర్టల్ ద్వారా ఛేదించి ఇబ్బందులకు అందజేశారు.

## ప్రజలను మోసం చేయడమే బిఆర్ఎస్ ఎజెండా : సామ రంగారెడ్డి



కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న సామ రంగారెడ్డి

**సైదాబాద్, జూలై 29 ప్రభాతవార్త:** ప్రజలను మోసం చేయడమే బిఆర్ఎస్ ఎజండా అని రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీ, కాకతీయ కాలనీలలో పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండా కాలంలో పూడికతీత పనులు చేపట్టకపోవడమే ప్రస్తుతం డివిజన్‌లో ముంపు సమస్యకు ప్రధాన కారణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం మీద ఉన్న శ్రద్ధ పాలన మీద లేదన్నారు. కొత్తరేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గానికి మంజూరైన సిడిఎఫ్ నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోస పూరిత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం బిజెపి తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ భాస్కర్, కిరణ్ కుమార్‌చ శ్రీనివాస్, రాకేష్ యాదవ్, కృష్ణగౌడ్ ,కృష్ణం రాజు, హరిప్రసాద్, వీరేషం గుప్తా, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఎమ్మెల్యే బేతి పర్యటన



రామంతాపూర్‌లో ఎస్ఎన్‌డిపి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**రామంతాపూర్, జూలై 29 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పర్యటించారు. రామంతాపూర్ గాంధీనగర్, శ్రీరామకాలనీ, సాయికృష్ణకాలనీ, అంబేడ్కర్ విగ్రహం, బాలకృష్ణనగర్, సత్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్ఎన్‌డిపి కింద చేపడుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామంతాపూర్‌లో మెహర్రం సందర్భంగా పీర్లను సందర్శించి దట్టీలుల సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, అరటికాయల భాస్కర్, ఎండి.ముస్తాక్, జెసిబి రాజు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం : ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, జూలై 29 ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ పాత పోస్ట్ ఆఫీసు వద్ద భారీగా కురిసిన వర్షానికి డ్రేనేజీ పొంగి ఓవర్ ఫ్లో అవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అదే విధంగా ఆ ప్రాంతంలో చెట్టు విరిగి పోయిందని దానిని తొలగించాలన్నారు. అదే విధంగా కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే శానిటేషన్ సిబ్బందిని పిలిపించి క్లీనింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, బాబ్జీ, రాములు, యాదగిరి, అధ్యక్షుడు సత్యమూర్తి, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలలో లబ్దిదారుల ఎంపిక విషయంలో ఎమ్మెల్యేల జోక్యం వద్దు : హరిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న హరిగౌడ్

**సైదాబాద్, జూలై 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల జోక్యం తగదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుదు లింగాల హరిగౌడ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గంలోని అర్హులందరికి రాజకీయాలకు అతీతంగా బిసి బందు, దళిత బందు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లబ్ది దారుల ఎంపికలో రాజకీయ జోక్యం వల్ల కొంత మందికే పథకాలు అందుతున్నాయని దీనివల్ల అర్హులైన వారు కూడా నష్టపోతున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

## కుమ్మరికుంట చెరువుకట్టపై వెంటనే రోడ్డును నిర్మించాలి : నవజీవన్‌రెడ్డి



కాలనీవాసులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ పరిధి కుమ్మరికుంట చెరువుకట్టపై ఇటీవలి వర్షాలకు రోడ్డు గుంతల మయంగామారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన చెరువుకట్టను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్‌నుంచి బీఎన్‌రెడ్డి, సాహెబ్‌నగర్ వైపు సుమారు 30 కాలనీలకు చెందిన ప్రజలు చెరువుకట్ట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. చెరువుకట్టను వెడల్పు చేయడంతో పాటు సుందరీకరణ పనులు చేపడుతామని రెండేళ్లుగా ప్రభుత్వం కట్టుకథలు చెబుతూ కాలం వెళ్లదీస్తోందన్నారు. కేవలం కొంతమేర మట్టిపనులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆయన మండిపడ్డారు. రోడ్డుపై వర్షాలకు ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారని వివరించారు. చెరువుకట్టపై రోడ్డు నిర్మాణం కోసం చాలాసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోతోందని ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకట్టపై వెంటనే రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పరసర కాలనీవాసులు రామకృష్ణ, బిక్షపతి, కిషోర్, వెంకట్‌రెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

## ఇబ్బందులు కలగకుండా చర్యలు : ఎమ్మెల్యే



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 29 ప్రభాతవార్త :** వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ అయ్యప్పకాలనీలోని ముంపుప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు. పక్క కాలనీ నుంచి వచ్చే వరదనీరు, డ్రైనేజీలో కలవడం వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లడం జరుగుతుందని, విద్యుత్‌వైర్లు కిందికి వేలాడుతున్నాయని, నూతన డ్రైన్స్ నిర్మాణం చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నాటి డ్రైనేజీ వ్యవస్థ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నూతన డ్రైనేజీ నిర్మాణం పనులు త్వరలో చేపడుతామన్నారు. విద్యుత్ వైర్లు వేలాడకుండా సరి చేస్తామని తెలిపారు. వరదనీటి ప్రభావంవల్ల ఇండ్లలోకి నీరు రావడం జరిగిందని, నూతన డ్రైనేజీ నిర్మాణంతో ఇబ్బందులు తొలగిపోతాయని హామీ ఇచ్చారు. గతంలో చిన్నపాటివర్షానికి కాలనీ మునిగిపోవడం జరిగేదని, ఎస్.ఎన్.డి.పీ. పనుల వల్ల కాలనీ వాసులకు వరదనీటి ముంపు నుంచి విముక్తి లభించిందని అన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంతుల రాజారెడ్డి, తూర్పాటి చిరంజీవి, గౌరీ, సతీష్, రమేష్, నర్సింహాచారి, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రుచిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థి చదువు ఆర్థిక చేయూత

**ఎల్.బి.నగర్, జులై 29 ప్రభాతవార్త :** పేదలకు చేయూతను అందించడంతో రుచిత చారిటబుల్ ట్రస్ట్ ముందు ఉంటుందని రుచిత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తోడుపునూరి సతీష్ అన్నారు. పేద విద్యార్థి రోహన్ చదువుకోసం రుచిత చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ. 35,500 వేల ఆర్థిక సహాయాన్ని సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన సతీష్ మాట్లాడుతూ పేద విద్యార్థి రోహన్ చదువు కోసం మానవతా దృక్పథంతో గత సంవత్సరం ఆర్థిక సహాయం అందజేమని తెలిపారు. అదే. స్ఫూర్తితో విద్యార్థి రోహన్ చదువుకోసం ఈ విద్యా సంవత్సరం కూడ ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ మేరకు విద్యార్థి తల్లికి ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. పేద విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా చేయూతనందిస్తున్నామని తెలిపారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూలై 29 ప్రభాతవార్త :** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని గాయత్రిపురం, నాగేశ్వర్ కాలనీ ప్రధాన రోడ్డుపై ఉన్న పాత బాక్స్ డ్రైనేజ్ నాలా గోడలు కూలిపోయినట్లు సమాచారం రావడంతో శనివారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులు ఏఈ మాతృనాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ వెన్నకటేశ్వర్లు, జలమండలి అధికారులు అరీఫ్‌లను పిలిపించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. వెంటనే అధికారులు సమన్వయతో నాళాల్లో కూలిపోయినటువంటి మట్టిని తొలగించి మరమ్మత్తులు చేయించాలని, డ్రైనేజ్ నీళ్ల రోడ్డుపైకి రాకుండా చూడాలని అన్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను తెలిపారు. వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, అనంతరాములు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూలై 29 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్‌లో కొనసాగుతున్న నాలా స్లాబ్ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం శశికిరణ్ అసుపత్రి నుండి బాప్టిస్ట్ చర్చి వరకు నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటి వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టునున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ సిబ్బంది సత్తిరెడ్డి, శ్రీనివాస్, నాయకులు ప్రవీణ్ యాదవ్, సందీప్‌రెడ్డి, దినేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు : ఏఈ రామకృష్ణ

**కుషాయిగూడ, జూలై 29 ప్రభాతవార్త :** కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు వేరు వేరు సమయాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ. పేర్కొన్నారు. 1.11 కెవి కాప్రా లీడర్ పరిధిలో ని భవాని నగర్ ఏపీఐఎస్సీ కాలనీ పల్లె పారడైజ్ శ్రీనగర్ కాలనీ పల్లె ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, 2.0 కె.వి నాగార్జున నగర్ ఫీడర్ పరిధిలోని నార్త్ కమల నగర్ కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఫేస్ టు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు, 4.11 కేవీ కమలానగర్ ఫీడర్ పరిధిలోని మార్కండేయనగర్ సుభాష్‌చంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 10:00 నుండి 11 గంటలవరకు, అదేవిధంగా 5.11 కెవి ఫీడర్ పరిధిలోని పద్మావతి కాలనీ కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఫేస్ టు రాధిక ఈసీఐఎల్ మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటలకు సాయంత్రం 5 గంటల వరకు, అదే విధంగా 3.11ల పరిధిలోని కుషాయిగూడ ఏపీఐఐసీ కాలనీ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

## కమ్యూనిటీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి : మేయర్ పారిజాత



స్లాబు పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న పారిజాత తదితరులు

**సరూర్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సూచించారు. కార్పొరేషన్‌లోని 23వ డివిజన్ ద్వారకాహిల్స్ కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ భవనాన్ని అదే విధంగా 29వ డివిజన్ బడంగ్‌పేట్ గాంధీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న మహిళా భవన్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నిర్మాణపు పనులను పర్యవేక్షించిన అనంతరం మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకుడు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, పలువురు మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సేవాభావం కలిగి ఉండాలి : కొలన్



విరాళం చెక్కును అందజేస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక సేవాభావాన్ని కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్య వర్గ సభ్యుదు, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని కొత్తగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి ఆయన తన స్వంతడబ్బు రూ.75 వేలను విరాళంగా ఇచ్చారు. బాలాపూర్‌లోని తన నివాసంలో ఆయన శనివారం ఆలయ కమిటీ సభ్యులైన కొత్తగూడ గ్రామ సర్పంచ్ సాద మల్లారెడ్డి తదితరులకు విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన, సేవాభావంతో మానసిక సంతృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొక్క ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు మొగుళ్ళపల్లి చేయూత

**ఎల్.బి.నగర్, జూలై 29 ప్రభాతవార్త :** మొగుళ్ళపల్లి యువసేన ఆధ్వర్యంలో గోదావరి వరద ముంపు బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉషాకిరణ్‌కు రూ.5వేల చెక్‌ను శనివారం జాతీయ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుదు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తాము నిరంతరం అండగా నిలుస్తామన్నారు. ఆపదలో ఉన్నవారికి తాము చేయుతను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినిమా కోరియోగ్రాఫర్ చిన్న చంద్రశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

## ఇల్లు కూలిన నిరుపేద కుటుంబానికి చేయూత



బాదితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, జూలై 29 ప్రభాతవార్త :** వరుసగా కురుస్తున్న వానకు నాచారం ఎర్రకుంటకు చెందిన జవాజి వెంకటేష్ ఇళ్లు కూలింది. దీంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదన చెందారు. కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ ద్వార విషయం తెలుసుకున్న బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్‌తో కలిసి వారి ఇంటికి వెళ్లారు. బాదిత కుటుంబాన్ని పరామర్శించి తాము ఉన్నామని భరోసానిచ్చి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం ద్వార కూడా సహాయసహకారాలు అందిస్తామని వారికి ధైర్యాన్ని ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలు ఎలాంటి ఆపద ఉన్నా తమ ట్రస్టు ద్వార ఆదుకుంటామని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ బాధితుడికి నగదు అందజేత

**మలక్‌పేట, జూలై 29 ప్రభాతవార్త:** పోగొట్టుకున్న నగదును ఎన్ఆర్ఐకి అందజేసిన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ కథనం ప్రకారం సౌదీ అరేబియాకు చెందిన ఎన్ఆర్ఐకి చెందిన పర్సు మూసారాంబాగ్‌లోని జామియా మజీద్ రోడ్డు వద్ద ఈ నెల 28వ తేదీన పడిపోయింది. కాగా సలీంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు పర్సు కనిపించడంతో పర్సును తీసుకుని చూడగా సౌదీ అరేబియాకు చెందిన 15వేల 200ల రియాల్స్ (మనదేశపు నగదు విలువ సుమారు రూ. 3 లక్షల 20 వేలు) గల నగదు కనిపించడంతో మలక్‌పేట పోలీసులకు అందజేశాడు. పోలీసులు నగదును పోగొట్టుకున్న బాధితుడి ఆచూకీని తెలుసుకున్నారు. శనివారం మలక్‌పేటలో బాధితుడు సయ్యద్ ఖాసీంకు అనిల్‌కుమారు నగదును అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ను అందరూ అభినందించారు.

## విజయపురి కాలనీ ఫేజ్-1లో సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ నియామకం



నూతనంగా నియామకమైన సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**వనస్థలిపురం, జూలై 29 ప్రభాతవార్త:** వనస్థలిపురం డివిజన్ విజయపురి కాలనీ ఫేజ్-1లో సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షుడిగా ఎంబికె సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా మాణిక్యప్రభు, సెక్రటరీగా విజయసారధి, జాయింట్ సెక్రటరీలుగా పి.లక్ష్మణ్‌రావు, ఎ.వి.ప్రసాద్, ట్రెజరర్‌గా జి.వి.రమణయ్య తదితరులు కార్యవర్గ సభ్యులుగా నియామకమయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు వృద్ధుల సంక్షేమంకొరకు తమ శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు.